అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం

• నగర మేయర్ శిరీష



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ అంజలి, డిప్యూటీ మేయర్ అభినయ్

తిరుపతి తుడా: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని నగర మేయర్ డాక్టర్ ఆర్ శిరీష అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన ప్రీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ అనుపమ అంజలి, ఉప మేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణతో పాటు అన్ని విభాగాల అధికారులు హాజరయ్యారు. నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి 50 డివిజన్‌లలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రజల కనీస అవసరాలను తీర్చడం తమ బాధ్యతగా వాటికే తొలి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించామన్నారు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, కోఆప్షన్ మెంబర్ వెంకట్ రెడ్డి, అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, డీసీపీ దేవికుమారి, ఆర్వో లోకేశ్వర వర్మ, కార్యదర్శి రాధిక, ఏసీపీ బాల సుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆసరా సంబరాలు



మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

తిరుపతి రూరల్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ‘వైఎస్సార్ ఆసరా’ సంబరాలను బుధవారం నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో నిర్వహించనున్నారు. ఆరు మండలాల్లో 6,508 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 58,409 మంది సభ్యులు ఉన్నారు. వారికి మూడో విడత ఆసరాలో భాగంగా ప్రభుత్వం రూ.64.36 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. ఆ మేరకు చెక్కులను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా మహిళా సంఘాలకు అందించనున్నారు.

నేటి నుంచి వేడుకలు....

వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు చంద్రగిరి ప్రభుత్వ బాలుర హైస్కూల్లో, మధ్యాహ్నం 12 గంటలకు ఎస్వీయూ ఆడిటోరియంలో, సాయంత్రం 3 గంటలకు రామచంద్రాపురం ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణం, అలాగే 31వ తేదీ పాకాల ప్రభుత్వ హైస్కూల్, మధ్యాహ్నం చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ కార్యాలయం, ఎర్రావారిపాలెం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసే సభల్లో ఆసరా చెక్కులను అందించనున్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

చంద్రగిరి: మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటలకు వైఎస్ఎంఆర్ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొనాలని కోరారు.

ఎల్లమ్మ సేవలో డీఎస్పీ నరసప్ప



నరసప్ప దంపతులకు తీర్థ ప్రసాదాల అందజేత

చంద్రగిరి: గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారిని మంగళవారం తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. పాలక మండలి సభ్యులు కోలా మల్లి, శిరీష్ రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, గొబ్బిళ్ల కిషోర్ ఉన్నారు.

విద్యార్థినులకు ఎన్‌సీసీ స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థినులతో ఎన్‌సీసీ అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి చిన్నబజారు వీధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థినులు 15 మందికి ఎన్‌సీసీ స్కాలర్‌షిప్‌లు మంజూరయ్యాయి. ఫైవ్ ఆంధ్రా గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ అంజు వాద్వా, ఏఓ మేజర్ మంగైకారతేలు విద్యార్థినులకు స్కాలర్‌షిప్ చెక్కులను అందజేసి అభినందించారు. కన్సిస్ ఆఫీసర్ భారతి, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

చెన్నకేశవరెడ్డి సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్: దివంగత సీనియర్ న్యాయవాది చెన్నకేశవరెడ్డి సేవలు మరువలేనివని తిరుపతి న్యాయవాదుల సంఘం గ్రంథాలయ కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. చెన్నకేశవరెడ్డి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తిరుపతి కోర్టు ఆవరణలో తన సొంత ఖర్చుతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారని గుర్తు చేశారు. సుమారు రూ.5లక్షల విలువ చేసే పుస్తకాలను వితరణ చేశారని తెలిపారు. గ్రంథాలయ మాజీ కార్యదర్శి ఉద య్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాన్ని నిర్మించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హరినాథ్, భార్గవి యాదవ్, దేవ రాజులు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నాగయ్యకు రంగస్థలి నివాళి

తిరుపతి కల్చరల్: సినీరంగంలో పోతన, రామదాసు, త్యాగయ్య, వేమన వంటి పాత్రలు పోషించి తెలుగువారి హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిన మహానటుడు చిత్తూరు నాగయ్య జయంతి సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రంగస్థలి నటుడు జీఎల్ కుమార్, హాస్యనటుడు కాంభోలు హరినాథ్‌లను సత్కరించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కొత్తపల్లి మునిరత్నం, కేఎస్.రాజా, వెంకట్రామయ్య, వాసురావు, రాజశేఖర్, చెంగారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు

• డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్నకొట్యా నాయక్



వైద్యసేవలపై బాలింత వద్ద ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్

చంద్రగిరి: రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోందని డీసీహెచ్ఎస్ డాక్టర్ చిన్న కొట్యా నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌తో కలిసి అన్ని వార్డులను పరిశీలించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు, పారిశుద్ధ్యం, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డులోని బాలింతల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని రికార్డులు, వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నాడు–నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో నిర్మించారని తెలిపారు. సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆస్పత్రి ఆవరణలో నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు



తిరుపతి తుడా: స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రి మెయిన్ ఎంట్రెన్స్ గేట్ పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో అక్రమ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు తొలగించారు. జేసీబీ సాయంతో రేకుల షెడ్డు కోసం నిర్మిస్తున్న కట్టడాలను మంగళవారం కూల్చివేశారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఖాళీ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఈఎస్ఐ సిబ్బంది మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, తహసీల్దార్ వెంకటరమణకు సోమవారం ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలను తొలగించారు.

మహిళా వర్సిటీ విద్యార్థినులకు ఉద్యోగాలు



ఆరెంజ్ సంస్థ ప్రతినిధులతో రిజిస్ట్రార్

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సీఎస్ఈ, ఈసీఈ విభాగాల్లో గత రెండు రోజులుగా ముంబైకి చెందిన ఆరెంజ్ బిజినెస్ సర్వీస్ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. అన్ని పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థినులను రూ.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరిని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్.ఉష అభినందించారు. ఆరెంజ్ సంస్థ ప్రతినిధులు సుదీప్‌కుమార్, కృష్ణకబ్రా, రమణన్ మహాలింగం, సుదీప్ లూత్రాలను సత్కరించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు



బహుమతులు అందజేస్తున్న నిరంజన్ బాబు

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురం పాఠశాలలో సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, డ్యాన్స్ సహా వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం క్రిష్టారెడ్డి, ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శరవణ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వెలుపల జస్టిస్ గంగారావు

తిరుమల/తిరుచానూరు(చంద్రగిరి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గంగారావు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లుచేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అదేవిధంగా జస్టిస్ గంగారావు తిరుచానూరు చేరుకుని శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పాకాల: పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని..రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్ బాబు, ఎంఈఓ బాబ్జీ, ఈఓపీఆర్డీ మాలతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

దర్శన దళారీపై కేసు

తిరుమల: శ్రీవారి దర్శన టికెట్లను అధిక ధరలకు విక్రయించిన దళారీపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన సుందరం శ్రీవారి దర్శనార్థం తిరుపతికి చెందిన నవీన్ అనే మధ్యవర్తి ద్వారా దళారీ వెంకటేశ్వరను సంప్రదించాడు. దళారీ భక్తుడికి నాలుగు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను రూ.18వేలకు విక్రయించాడు. మోసపోయామని గుర్తించిన భక్తులు టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్‌టీయూసీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేస్తున్న ఉపేంద్రరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఘనంగా నిర్వహించారు. ఏపీ యూనివర్సిటీస్ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీరెడ్డి, వైఎస్ఆర్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వెంకటేష్ పాల్గొని ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్మికులను ఆదుకోవాలనే సదుద్దేశంతో ఆటో కార్మికులు, తోపుడు బండ్ల వ్యాపారులు, నాయీబ్రాహ్మణులు, రజక కార్మికులతో పాటు అన్ని రంగాల కార్మికులకు సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేయూతనందిస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి సూచనలతో అన్ని వర్గాల కార్మికులకు మేలు చేకూరేలా రాబోవు రోజుల్లో ట్రేడ్ యూనియన్ తరపున పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. అనంతరం గౌతమ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేకును కట్‌చేసి కార్మికులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ తిరుపతి నగర అధ్యక్షుడు తిరుమలరెడ్డి, వివిధ కార్మిక సంఘాల నేతలు ప్రభాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, ముత్తువేలు, రఫీ, రామయ్య, యువరాజు, భరత్, ముత్తువేలు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల ప్రతిభ



వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాసరావు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఇంటర్, సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు 28 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థ అడ్మిన్ ప్రిన్సిపల్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ విద్యార్థులు 28ఆల్ ఇండియా ర్యాంకులు సాధించడం తమ విద్యాసంస్థకు గర్వకారణమని తెలిపారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులతో కలిసి కేక్ కట్ చేశారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డికి సేవాదళ్ నేతల సత్కారం



ఎమ్మెల్యే చెవిరెడ్డితో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ రాజేంద్ర

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర సమన్వయకర్త, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాల వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ తలారి రాజేంద్ర సత్కరించారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో చెవిరెడ్డిని కలిసి దుశ్శాలువతో సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మూడు జిల్లాల్లో పార్టీ బలోపేతానికి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రాజేంద్రకు ఎమ్మెల్యే చెవిరెడ్డి సూచించారు. శివాడి రాజశేఖర్, ప్రవీణ్, రాజేష్, విష్ణుకుమార్ ఉన్నారు.

విద్యార్థి విభాగం నేతలు..

ఎమ్మెల్యే చెవిరెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం తిరుపతి, కడప, నెల్లూరు జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ రాజశేఖర్‌రెడ్డి సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి విభాగం నేతలు నాగరాజు,ముని, భరత్, కేదర్, ప్రశాంత్, ప్రసన్న పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి నైపుణ్య శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

చంద్రగిరి: మండలంలో చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తారని ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈఓఆర్డీ శశిరేఖ, కోఆర్డినేటర్లతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేలా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో నిరుద్యోగ యువతను ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు తమ పరిధిలోని నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలను తెలిపి వారికి అవగాహన కల్పించాలని కోరారు. కోఆర్డినేటర్‌లు సురేష్, అశోక్ మాట్లాడుతూ.. 5వ తరగతి చదువుకున్న వారి నుంచి డిగ్రీ ఆపై చదువుకున్న వారి వరకు ప్రతిభ ఆధారంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒక్కో కోర్సు నిర్వహణకు ప్రభుత్వం రూ.3 లక్షలు ఖర్చు చేస్తోందని, పూర్తి ఉచితంగా మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. పరీక్షల్లో పాసైన వారికి సర్టిఫికెట్లను ఇస్తారని.. తద్వారా వారికి నచ్చిన రంగంలో ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. తిరుపతిలోని పద్మావతిపురం ప్రభుత్వ ఐటీఐ, మెడికల్ కళాశాల సమీపంలోని ఎస్‌ఏసీ, ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఉంటుందని తెలిపారు. 30కు పైగా కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కోర్సులకు వలంటీర్ల ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

టౌన్‌బ్యాంక్‌లో మరిన్ని సేవలను తీసుకొస్తాం

–చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి



బ్యాంక్ అధికారులతో చర్చిస్తున్న జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు

తిరుపతి మంగళం: తిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్(టౌన్‌బ్యాంక్) ఖాతాదారులకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి అన్నారు. గుంటూరు అర్బన్ పరిధిలోని కో–ఆపరేటివ్ బ్యాంక్‌ను డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, పోలిరెడ్డి నాగిరెడ్డి, రేమాల బ్రహ్మానందరెడ్డితో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. బ్యాంక్ అనుసరిస్తున్న విధివిధానాలను పరిశీలించారు. గృహ నిర్మాణాలు, వాహనాలు, వ్యాపారులు, డ్వాక్రా సంఘాలకు ఇస్తున్న రుణాలపై అక్కడి బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో కూడా విరివిగా లోన్లు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ తెలిపారు. డ్వాక్రా లోన్లపై బుధవారం విజయవాడలో ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీని కలవనున్నట్లు తెలిపారు.

సమగ్ర వ్యవసాయ పద్ధతులతోనే ఆదాయం



రైతులకు మెలకువలను వివరిస్తున్న అధ్యాపకులు

తిరుపతి రూరల్: పంటల సాగులో విత్తు నుంచి కోత వరకు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని, అప్పుడే సాగు ఖర్చులు తగ్గి అధిక ఆదాయం పొందవచ్చని ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ కృష్ణారెడ్డి తెలిపారు. వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. సాగులో తీసుకోవాల్సిన మెలకువలను వివరించారు. వ్యవసాయ మేళాను ఏర్పాటు చేశారు. సీనియర్ శాస్త్రవేత్త దేవకి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రెడ్డికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సజ్జలకు వినతి పత్రం ఇస్తున్న ప్రవీణ్

తిరుపతి కల్చరల్: క్రైస్తవుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం విజయవాడ కార్యాలయంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రవీణ్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడంపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. స్పందించిన సజ్జల 1998 మెమో సర్క్యులర్‌ను రద్దు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుపతి తుడా/తిరుపతి కల్చరల్: నగరంలోని అన్నారావు కూడలి యానాది కాలనీ వాసుల కోసం టాటా క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో ఉయ్ సపోర్ట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకురాలు తహసున్నీసాబేగం, కార్పొరేటర్ నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

మామండూరులో వైద్య శిబిరం

చంద్రగిరి: మండల పరిధిలోని మామండూరు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సుభాస్ చంద్రబోస్, వైద్యాధికారి శివాజీ ప్రయాగ్ పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అజయ్

తిరుపతి గాంధీ రోడ్: బీజేపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొత్తపల్లి అజయ్ కుమార్‌ను మంగళవారం నియమించారు. ఆ పార్టీ నాయకులు గోపినాథ్ రెడ్డి, మురళి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లార రవి ఆయన్ను ఘనంగా సత్కరించారు.